ఈ-పేపర్ తెలుగు డైలీ | 8PM

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

మంగళవారం 18, జూలై 2023

ఈ నెల 26న రాచకొండ కమిషనరేట్ పరిధిలో

వాహనాల వేలం

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 18: రాచకొండ కమిషనరేటర్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో పలు కేసుల్లో పట్టుబడ్డ పలు వాహనాలకు ఈ నెల 26న వేలం వేయనున్నట్టు రాచకొండ పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 161 ద్విచక్ర, తిచక్ర వాహనాలు వేలానికి సిద్ధంగా ఉన్నాయన తెలిపారు. ఈ నెల 26న ఆదివారం అంబర్ పేట లోని రాచకొండ పోలీస్ సిటీ ఆర్మ్డ్ సిటీ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ నుండు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 25 న కార్ క్వార్టర్స్ పెరేడ్ మైదానం నందు అదిషినల్ డీసీపీ అనుమతితో వాహనాలను పరిశీలించుకోవచ్చిని తెలిపారు. ఇతర వివరాలకు 8712662209, 8008338535 నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

తెలంగాణలో 3 రోజులు వాన దంచుడే దంచుడు..? ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్..!

2

ఎకరం రూ.50 కోట్ల భూమి రూ.3.41కోట్లకే..? రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

2

గురుకుల ప్రవేశాల్లో మిగిలిన సీట్లు... భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

2

అనంతరాంనగర్ కాలనీ నంచి కేపీఎం సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు కె.ప్రవీణ్ ముదిరాజ్ ఆధర్యంలో ఫలహారపు బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ధూంధాంగా ఫలహారం బండ్ల ఊరేగింపు..

ముగిసిన బోనాల జాతర..

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 18: బోనాల ఉత్సవాల్లో భాగంగా నిన్న రెండో రోజు అంబర్ పేట నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో భవిష్యవాణి, ఘటాలు, ఫలహార బండ్ల ఊరేగింపు ధూంధాంగా జరిగాయి. పోతురాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువత కేరింతల నడుమ ఫలహార బండ్ల ఊరేగింపు కనువిందుగా సాగాయి. అంబర్ పేట మహంకాళీ ఆలయంతో పాటు అంబర్ పేట, బాగ్ అంబర్ పేట, గోల్నాక, నల్లకుంట, కాచిగూడ తదితర ప్రాంతాల్లోని అమ్మారి ఆలయాల్లో రంగం(భవిష్యవాణి), ఘటాలు, ఫలహార బండ్ల ఊరేగింపు ఘనంగా జరిగాయి.

కె.ప్రవీణ్ ముదిరాజ్ ఆధర్యంలో ఫలహారపు బండి ఊరేగింపులో పాల్గొన్న టేబుల్ టెన్నీస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్

న్యూపటేల్ నగర్‌లో అంబర్ పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారపు బండి ఊరేగింపులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఈ స్టేషన్లలో ఇక ఆ రైళ్లు ఆగుతాయి..

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విజ్ఞప్తిని ఓకే చేసిన రైల్వే మంత్రి

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18: తెలుగు రాష్ట్రాలవారికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. సూదూర ప్రాంతాలకు వెళ్లే పలు ముఖ్యమైన రైళ్లను తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ముఖ్యమైన స్టేషన్లలో ఆపాలంటూ కొనసాగుతున్న డిమాండ్‌కు బ్రేకులు వేసింది. దీర్ఘకాలంగా తెలంగాణతోపాటుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు చేస్తున్న డిమాండ్లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన సూచనకు రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా స్పందించింది. తనకు వచ్చిన డిమాండ్లను రైల్వేమంత్రి అశ్విణి వైష్ణవ్‌ను కలిసి వివరించారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. ఆయా స్టేషన్లలో ముఖ్యమైన రైళ్లను ఆపడం ద్వారా ప్రయాణికులకు కలిగే సౌకర్యం గురించి వివరించారు. ఈ అంశంపై అధికారులతో మాట్లాడిన రైల్వే మంత్రి అశ్విణి వైష్ణవ్.. గ్రీన్ సిగల్ ఇచ్చారు.

తాజాగా ఈ డిమాండ్లకు అంగీకరిస్తూ.. ఆయా రైల్వేస్టేషన్లలో వివిధ ప్రధానమైన రైళ్లను ఆపనున్నట్లుగా ప్రకటించారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పలు స్టేషన్లు ఉన్నాయి. తెలంగాణలో బెల్లంపల్లి, సిర్పూర్-కాగజ్‌నగర్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, గద్వాల్ రైల్వే స్టేషన్లలో సూదూర ప్రాంతాలకు వెళ్లే పలు ముఖ్యమైన రైళ్లు ఇక ముందు ఆగనున్నాయి.ఆంధ్రపదేశ్‌లో.. పిడుగురాళ్ల, నడికుడి, సత్తెనపల్లి, డోర్నకల్, బొబ్బిలి, దువ్వాడ, పీలేరు స్టేషన్లలో వివిధ రైళ్లను ఆపనున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

విదేశాల్లో మన వారికి సరైన గౌరవం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18: లండన్ హీత్రూ ఎయిర్పోర్టుకు చేరుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ - యూకే విభాగం ఆధ్వర్యంలో విమానాశ్రయంలో సంప్రదాయ పద్ధతిలో ఢోల్ వాద్యాలు, వేద మంత్రోచ్ఛారణ, హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని దీప ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 ఏళ్లలో నరేంద్రమోదీ సర్కారు చేపట్టిన కార్యక్రమాలను భారతీయ సమాజంలో వచ్చిన మార్పుల గురించి తెలిపారు. విదేశాల్లో ఉంటున్న భారతీయుల ఆకాంక్షలను పూర్తిచేయడం, విదేశాల్లో వారికి సరైన గౌరవం లభించేలా మోదీ సర్కారు తీసుకుంటున్న కార్యక్రమాలను వివరించారు. సంస్కృతి సెంటర్ ఫర్ కల్చరల్ ఎక్సెన్స్ విద్యార్థులైన యువత చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ యూకే విభాగం అధ్యక్షుడు కుల్దీప్ షెకావత్, ప్రధానకార్యదర్శి శ్రీ సురేశ్ మంగళగిరి భారత సంతతికి చెందిన పలువురు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా బదిలీలు..

అంబర్ పేట డీసీ కూడా !

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 18: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో భారీగా బదిలీలు చేపట్టారు. 26 మంది డిప్యూటీ కమిషనర్లను బదిలీ, పోస్టింగ్ ఇస్తూ జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవలే జిహెచ్ఎంసికి కొత్త కమిషనర్ గా రోనాల్డ్ రోస్ వచ్చారు. ఆయన పలు అంశాలపై రివ్యూ నిర్వహించి జిహెచ్ఎంసిలో డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పలువురికి స్థానచలనం కలగగా, మరికొంతమందికి ఇటీవల మున్సిపల్ కమిషనర్ల నుంచి రిలీవైన వారికి పోస్టింగ్లను ఇచ్చారు. కాగా..అంబర్ పేట్ డీసీ వేణుగోపాల్ ను తదుపరి ఆదేశాల వరకు జీహెచ్ఎంసీ కమిషనర్ కు అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 18:

అంబర్ పేట మహంకాళి అమ్మవారి ఘటాన్ని సాగనంపే కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మవెంకట్ రెడ్డి, డాక్టర్ గౌతంరావు, ఏడెల్లి అజయ్ కుమార్ తదితరులు

బిజెపి ఆధ్వర్యంలో

చెట్ల కింద "టిఫిన్ బ్రెక్"

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 18: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ అంబర్‌పేట అసెంబ్లీ ఆధ్వర్యంలో ఇయ్యాల ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి చెట్ల కింద టిఫిన్ చేశారు. నియోజకవర్గం తాజా రాజకీయ పరిస్థితులపై ముచ్చటించారు.

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 18:

గోవింద్ నగర్‌లోని మైసమ్మ దేవాలయంలో ఇయ్యాల బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి పూజలు చేస్తున్న బీజేపీ నేత చింతల శ్రీనివాస్ ముదిరాజ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూలై 18: అంబర్ పేట డివిజన్ లోని ఫలహారపు బండ్ల ఊరేగింపులో బీజేపీ నేతలు డాక్టర్ ఎన్. గౌతంరావు, దాసోజు నాగభూషణం చారి, ఏడెల్లి అజయ్ కుమార్, యశ్వంత్, మైలారం రాజు, వెంకటస్వామి గౌడ్, భాస్కర్ గౌడ్, తిరుపతి గుప్తా, ఎస్ ఎస్ రెడ్డి, మనోజ్ యాదవ్, జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఇంటిపేరు కేసు.. రాహుల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూలై 18: మోదీ ఇంటిపేరు వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. పరువునష్టం కేసులో రాహుల్‌ను దోషిగా తేలుస్తూ సూరత్ కోర్టు రెండేండ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. దీనిపై స్టే విధించాలని ఆయన గుజరాత్ హైకోర్టు గడప తొక్కారు. అయితే స్టేకు నిరాకరిస్తూ కోర్టు ఈ నెల 7న తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో ఈ నెల 15న పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారించేందుకు సమ్మతించిన సుప్రీంకోర్టు.. ఈ నెల 21న బెంచ్ ముందుకు రానుంది. కాగా, రాహుల్ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని ఆయన తరుఫు న్యాయవాది అభిషేక్ మను సింగ్వీ న్యాయస్థానాన్ని కోరారు. అయితే దానికి న్యాయమూర్తి నిరాకరించారు.

ఎకరం రూ.50 కోట్ల భూమి
రూ.3.41 కోట్లకే..?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీకి కోకాపేట్‌లో 11 ఎకరాల స్థలాన్ని కేటాయించిన సంగతి తెలిసిందే. నాలెడ్జ్ సెంటర్ (సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్) కోసం ఆ స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఉత్తర్వులపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వంతో పాటు బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.కోకాపేటలో బీఆర్ఎస్ పార్టీకి 11 ఎకరాలు కేటాయిస్తూ.. మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయం మేరకు ఆ స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీకి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనికి సంబంధించిన జీవోను గోప్యంగా ఉంచారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి హైకోర్టులో ఇటీవల ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కోకాపేటలో ప్రస్తుతం మార్కెట్ ధర ఒక్కో ఎకరానికి సగటున రూ. 50 కోట్లు పలుకుతుందని.. ప్రభుత్వం మాత్రం బీఆర్ఎస్ పార్టీకి ఎకరానికి రూ. 3.41 కోట్లకే కట్టబెట్టిందని పిల్‌లో పేర్కొన్నారు. భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో సైతం

పబ్లిక్ డొమెయిన్‌లో పెట్టకుండా గోప్యంగానే ఉంచారన్నారు. ప్రభుత్వానికి చెందిన స్థలాన్ని పార్టీ అవసరాల కోసం ఇవ్వడాన్ని ఫోరం తప్పుపట్టింది.

తెలంగాణలో 3 రోజులు వాన దంచుడే దంచుడు.... ?
ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్..!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 18: తెలంగాణ ప్రజలకు వాతవరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడటంతో తెలంగాణలోని ఈరోజు నుంచి మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న వెల్లడించారు. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు.. కొన్ని జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలుండాగా.. మరికొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ఛాన్స్ కూడా ఉందని నాగరత్న తెలంపారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా రెడ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపారు. అయితే. ఒడిశాతో పాటు దాన్ని ఆనుకుని ఉన్న జార?ండ్ ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని.. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్టు నాగరత్న వివరించారు.ఈ అవర్తనం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో అనేక చోట్ల మూడు రోజుల పాటు.. తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు, భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపారు. ఒకటీ రెండు జిల్లాలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కూడా కురిసే ఛాన్స్ ఉందన్నారు. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, ఖమ్మం జిల్లాలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. సిద్దిపేట, జనగామ, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి,

సంగారెడ్డి, రంగారెడ్డి ప్రాంతాల్లో భారీ వర్ష సూచనలు కనిపిస్తున్నాయని నాగరత్న పేర్కొన్నారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లో కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్సులున్నాయని వాతావరణ శాఖ అధికారుల చెప్తున్నారు. ఇక హైదరాబాద్ నగరంలోనూ ఎడతెరపిలేని వర్షాలతో పాటు అప్పుడప్పుడు భారీ నుంచి వేగవంతమైన జల్లులు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే.. మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలుస్తోంది. మిగతా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్‌కు కూడా ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

సింగూరు ప్రాజెక్టుకి వరద....

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 18: సింగూరు ప్రాజెక్టుకి స్వల్పంగా వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం- 18.359 టీఎంసీ లుగా ఉంది. ఇన్ ఫ్లో- 1050 క్యూ సెక్కులు, ఔట్ ఫ్లో- 320 క్యూసెక్కులు ఉందని అధికారులు తెలిపారు. కాగా, గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులో 21.017 టీఎంసీ ల నీటిమట్టం ఉండేది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం లేకపోవడంతో ప్రస్తుతం 18.359 టీఎంసీ లుగా ఉంది.

గురుకుల ప్రవేశాల్లో మిగిలిన సీట్లు...
భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 18: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సారానికి సంబంధించి ప్రవేశాల్లో దళారులను అడ్డుకునేందుకు సొసైటీలు కొత్త విధానం అమల్లోకి తీసుకువచ్చాయి. 5వ, 6వ, 7వ, 8వ తరగతుల్లో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించేలా కొత్త కార్యచరణను రూపొందించింది. ఈ విధానం ద్వారా విద్యార్థుల ప్రతిభ, సామాజిక పరిస్థితులు పరిశీలించి సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులకు సీట్లు ఇప్పిస్తామని మభ్య పెట్టేవారిపై కఠిన చర్యలకు పూనుకుంటోంది. మిగిలిన సీట్లకు ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ఫోన్ చేసి లేదా ఎస్ఎంఎస్‌లు పంపించి ప్రవేశాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాగా... గురుకులాల్లో అయిదో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు చదువుకునేందుకు అవకాశం ఉన్నందున ఈ సీట్లకు డిమాండ్ బాగానే

ఉంది. విద్య, వసతి ఉండడంతో సీట్లకు పోటీపడుతున్నారు. గురుకులాల్లో ప్రవేశ పరీక్షల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో అయిదో తరగతి, ఇంటర్, డిగ్రీతో పాటు బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతోంది. కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను ఈ మేరకు భర్తీ చేయనున్నట్లు గురుకుల సొసైటీ తెలిపింది.

కొత్త స్లీపర్, అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లతో దూసుకొస్తున్న
వందే సధారన్ రైలు.. ఎప్పుడొస్తుందంటే..

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూలై 18: సామాన్యులకు వందే భారత్..? అవును ఇది నిజం..సామాన్యులు ఎదురుచూసే కొత్త నాన్-ఏసీ రైలును అందుబాటులోకి తీసుకురావాలని చూస్తోంది భారతీయ రైల్వే. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పెంచిన తర్వాత.. భారతీయ రైల్వేలు ఇప్పుడు అప్‌గ్రేడ్ చేసిన సెకండ్ క్లాస్ అన్‌రిజర్వ్‌డ్, సెకండ్ క్లాస్ 3-టైర్ స్లీపర్ కోచ్‌లతో కొత్త రైలును తయారు చేయాలని భావిస్తోంది. కొత్త రైలు పేరు ఇంకా నిర్ణయించలేదు. అయితే సామాన్యులకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు ఈ రైలును తయారు చేయాలనే ఆలోచన చేస్తోంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల తరహాలో కొత్త రైలులో కొన్ని ఫీచర్లు ఉంటాయని ఓ అధికారి తెలిపారు. భారతీయ రైల్వేలు ఇప్పుడు అప్‌గ్రేడ్ చేసిన సెకండ్ క్లాస్ అన్‌రిజర్వ్‌డ్, సెకండ్ క్లాస్ 3-లెవల్ స్లీపర్ కోచ్‌లతో కొత్త వందే ఆర్డినరీ రైలును ప్రవేశపెట్టాలని చూస్తోంది.

కొత్త రైలు పేరును ఇంకా నిర్ణయించలేదు. అయితే దీనికి వందే సాధారణ్ లేదా వందే అంత్యోదయ అని పేరు పెట్టే అవకాశం ఉంది.

సామాన్యులకు మెరుగైన ప్రయాణం కోసం ఈ రైళ్లను తయారు చేయనున్నట్లుగా తెలుస్తోంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల తరహాలో కొత్త వందే సాధనన్ ఎక్స్‌ప్రెస్‌కు కొన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు ఒక అధికారి మీడియాకు తెలిపారు. వందే భారత్, వందే సాధన్ రైలు మధ్య ఉన్న అతి పెద్ద వ్యత్యాసం ఏంటంటే, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రెండు వైపుల నుండి ఆటోమేటిక్ రైలు, మరోవైపు వందే సాధన్ లోకోస్ ద్వారా నడుస్తుంది. సమస్య ఏంటంటే చాలా రైళ్లు లోకోమోటివ్ ద్వారా లాగబడతాయి.. కానీ దీనికి రెండు చివర్లలో లోకోమోటివ్‌లు ఉంటాయి.

స్టాక్ మార్కెట్‌లో బుల్‌జోరు..
వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిసిన సూచీలు..!

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 18: ఇయ్యాల మంగళవారం ఉదయం సెన్సెక్స్ 66,828 పాయింట్ల వద్ద లాభాలతో ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 67,007 పాయింట్ల మార్క్‌ను తాకింది. చివరకు 205.21 పాయింట్ల లాభంతో 66,795.14 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరో వైపు నిఫ్టీ 37.80 పాయింట్ల లాభంతో 37.80 పాయింట్ల వద్ద ముగిసింది. సోమవారం ట్రేడింగ్‌లో ఐటీరంగ షేర్ల కొనుగోళ్లు మార్కెట్ ప్రభావం చూపగా.. మంగళవారం ట్రేడింగ్ ప్రారంభంలో బ్యాకింగ్ రంగంలో బంపర్ కొనుగోళ్లు కనిపించాయి. దాంతో ఇండెక్స్ ఆల్‌టైమ్ హైకి చేరుకుంది. బ్యాంకింగ్ ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంకుల షేర్లు భారీగా పతనం కావడం, గ్లోబల్ మార్కెట్లలో ప్రతికూల పవనాలతో మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది.ఇక ట్రేడింగ్‌లో దాదాపు 1,384 షేర్లు పురోగమించగా.. 1958 షేర్లు క్షీణించాయి. 118 షేర్లు మాత్రంమ మారలేదు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్ టాప్ గెయినర్స్‌గా నిలువగా.. ఎల్‌టీఐ మిండ్‌ట్రీ, బ్రిటానియా ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టైటాన్ కంపెనీ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం క్షీణించింది. మెటల్, రియాల్టీ సూచీలు దాదాపు ఒక్కోశాతం క్షీణించగా, పవర్ ఇండెక్స్ 0.6 శాతం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండెక్స్ ఒక శాతం పెరిగింది.

ఇంకా వరద గుప్పిట్లోనే
దేశ రాజధాని ఢిల్లీ

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూలై 18: గత కొన్నిరోజులుగా కుండపోత వానలు, వరదలతో ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు, వరదలు ఇప్పటికీ వీడలేదు. యమునా నది మహోగ్ర రూపం ఇంకా కొనసాగుతూనే ఉంది. వారం రోజులుగా వరద గుప్పిట్లోనే ఉన్న ఢిల్లీ నగరం.... భారీ వర్షాలు కురుస్తూనే ఉండడంతో ఇప్పట్లో జల దిగ్బంధనం నుంచి బయటపడే పరిస్థితులు కనిపించడంలేదు. దేశ రాజధానిలోని ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. ఐపీ ఫ్లైఓవర్ వద్ద డ్రెయిన్ పొంగిపొర్లుతోంది. దాంతో రాజ్ ఘాట్ నుంచి నిజాముద్దీన్ వరకు మురికినీటితో నిండిపోగా, ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. మరోవైపు, ఢిల్లీకి ఇంకా వానలు తొలగిపోలేదని, రేపు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది. అటు, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఝార?ండ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మరో 5 రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

హైదరాబాద్‌లో బిర్లా ప్లానిటోరియం..
నయా విజువల్‌తో వండర్ షో

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 18: విశ్వాన్ని అర్థం చేసుకోవడంలో హై ఎనర్జీ ఫిజిక్స్ ఎంతో కీలకమైనది. ఈ విశ్వంలో రేడియేషన్ల ప్రభావంతో వెలువడే వేడి, వయోలెంట్ యునివర్స్ ప్రక్రియలు అద్భుతం. ఇన్నాళ్లు గెలాక్సీ, ఖగోళ వస్తువుల గురించి అవగాహన కల్పించిన జీపీ బిర్లా ప్లానిటోరియం ఇకపై విజ్ఞాన శాస్త్రాని విస్తృత పరిచేలా గెలాక్సీ సముహాల్లోని అత్యంత ఉష్ణం కలిగిన ఖగోళ దృశ్యాలను కళ్లకు కట్టినట్లు చూపెడుతోంది.విశ్వంలో ఉండే అతి భారీ వస్తువులతో పాటు గెలాక్సీ కేంద్రాల్లోని సూపర్ మాసివ్ బ్లాక్ హెూల్స్ చూట్టు ఉండే వేగవంతమైన వేడి వస్తువులను సైతం అధ్యయనం చేసేలా సరికొత్త ప్లానిటోరియం షో ఉంది. హై ఎనర్జీ రేడియేషన్ అనేది మన గెలాక్సీ, న్యూట్రాన్ స్టార్స్, సూపర్ నోవా అవశేషాలు, సూర్యుడు వంటి ముఖ్యమైన నక్షత్రాల గురించి కీలక సమాచారాన్ని అందిస్తుంది. అలాంటి సైన్స్‌ను విద్యార్థులకు, అంతరిక్ష అద్భుతాలను తెలుసు కోవాలని ఆసక్తి ఉన్నవారికి బిర్లా ప్లానిటోరియం సరికొత్త విజువల్ వండర్ షోను అందుబాటులోకి తెచ్చింది.అనంత విశ్వంలో అద్భుతమైన గ్రహాలు, నక్షత్రాల గురించి విశ్వం పుట్టుకను తెలిపేలా 'ది బయోగ్రఫీ ఆఫ్ ది యూనివర్స్' ఇప్పటివరకు షో వేసేవారు. ఇక నుంచి ది హాట్ అండ్ ఎనర్జిటిక్ యూనివర్స్ పేరుతో విశ్వంతో పాటు రేడియేషన్ల కారణంగా భూమిపై మనకు తెలియని వేడి, యూని వర్స్‌లో సంభవించే ప్రక్రియలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు.

విశ్వాన్ని అధ్యయనం చేసేవారికి ఎంతో ఉపయోగపడే ఈ షో.. అత్యధిక శక్తిగల ఖగోళ దృశ్యాలు, ఆధునిక ఖగోళశాస్త్రంలో విజయాలు, అబ్జర్వేటరీలు, విదుదయా స్కాంత వికిరణం ప్రాథమిక సూత్రాలు, హై ఎనర్జీ అస్ట్రోఫిజిక్స్ వంటి అంశాలపై ప్రేక్షకులు లీనమయి చూసే దృశ్యాలతో షో ఉంటుంది. ముఖ్యంగా ఆకాశంలో జరిగే అద్భుతాలు బ్లాక్ హెూల్, కొత్త నక్షత్రాల నిర్మాణం, హై ఎనర్జీ రేడియేషన్ సహా ఎన్నో కీలక అంశాలు కళ్లముందు మెదులుతాయి.

పాత విధానంలోనే ఎంబీబీఎస్ కౌన్సెలింగ్.. ఎన్ఎంసీ ప్రకటన

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూలై 18: దేశ వ్యాప్తంగా 2023-24 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ఈ ఏడాది పాత విధానంలోనే కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్ఎంసీ స్పష్టం చేసింది. ఆలిండియా కోటా మొదటి రౌండ్ తర్వాతే రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ నిర్వహించుకోవాలని తెలియజేస్తూ అన్ని రాష్ట్రాలకు ప్రకటన వెలువరించింది. నీట్ యూజీ 2023లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆలిండియా కోటా సీట్ల భర్తీకి మొదటి రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత రాష్ట్రాల మెడికల్ యూనివర్సిటీలు మొదటి రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తాయి. ఈ ఏడాది దేశంలోని అన్ని రాష్ట్రాల కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ఎంసీసీనే కౌన్సెలింగ్ నిర్వహింస్తామని చెప్పిన సంగతి తెలసిందే. ఐతే ఈ ప్రతిపాదనను తెలంగాణ, తమిళనాడు సహా మరికొన్ని రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో కేంద్రం వెనకడుగు వేసింది. కాగా రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మొత్తం 3,790 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా వీటిలో ఆలిండియా కోటా 15 శాతం సీట్లు మినహాయిస్తే మిగిలినవి 3221 ఎంబీబీఎస్ సీట్లు, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 50

శాతం కన్వీనర్ కోటా కింద మరో 2325 సీట్లకు కలిపి మొత్తం 5,546 సీట్లకు కాళోజీ యూనివర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

తెలంగాణ నుంచి 44,629 మంది అర్హత సాధించగా వీరిలో ఇప్పటి వరకు 23 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2023-24, 2025-26 విద్యాసంవత్సరాలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది.

జమ్మూ కశ్మీర్‌లో ఆపరేషన్ త్రినేత్ర...
నలుగురు ఉగ్రవాదుల ఖతం

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18: జమ్మూ కశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ త్రినేత్ర విజయవంతంగా కొనసాగుతోంది. ఒక్కరోజులోనే భద్రతా బలగాలు నలుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. గత రాత్రి భద్రతా బలగాలు సింధార ప్రాంతంలో డ్రోన్ల సాయంతో గాలింపు చేపట్టాయి. పూంచ్ సెక్టార్ లోని సురాన్ కోట్ వద్ద ఉగ్రవాదుల కదలికలు గుర్తించడంతో, భారీ సంఖ్యలో భద్రతా బలగాలను అక్కడికి తరలించారు. ఈ ఉదయం నుంచి ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య భారీగా కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మరణించినట్టు గుర్తించారు. వారి నుంచి ఏకే-47 తుపాకులు, మందుగుండు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వీరు పూంచ్, రాజౌరీ సెక్టార్లలో దాడులు చేసేందుకు వచ్చినట్టు భావిస్తున్నారు. మృతిచెందిన ఉగ్రవాదుల్లో విదేశీయులు కూడా ఉన్నట్టు గుర్తించారు. కాగా, ఆపరేషన్ త్రినేత్రలో భారత సైన్యానికి చెందిన స్పెషల్ ఫోర్స్, రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూ కశ్మీర్ పోలీసులు పాలుపంచుకున్నారు.

బైక్‌పై జంట రొమాన్స్.. వీడియోపై స్పందించిన ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18: బైక్‌లపై యువ జంటల రొమాన్స్ శృతి మీరుతోంది. దేశంలో ఇటీవల పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా ఢిల్లీలో ఓ యువ జంట బైక్‌పై రొమాన్స్ చేస్తున్న వీడియో రిలీజైంది. బైక్‌పై వెళ్తున్న ఆ జంట పబ్లిక్‌గానే తమ ప్రేమను వ్యక్తం చేశారు. బైక్ ట్యాంక్‌పై కూర్చున్న అమ్మాయి.. రైడింగ్ చేస్తున్న వ్యక్తిని కౌగిలించుకున్నది. అయితే బౌటర్ రింగు రోడ్డు పైఓవర్‌పై వెళ్తున్న ఆ జంటను ఓ వ్యక్తి వీడియో తీశాడు. గాఢంగా హత్తుకుని బైక్‌పై ఫుల్ ఎంజాయ్ చేస్తున్న ఆ జంట వీడియో ప్రస్తుతం వైరల్ అయ్యింది. దీనిపై ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తుల సమాచారాన్ని చేర వేసినందుకు పోలీసులు థ్యాంక్స్ తెలిపారు. ఢిల్లీ ట్రాఫిక్ పోలీసు సెంటినల్ యాప్‌కు ఇలాంటి ఘటనలు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఒక ట్విట్టర్ యూజర్లు మాత్రం తమదైన స్టయిల్‌లో ఆడేసుకుంటున్నారు. అమ్మాయి హెల్మెట్ పెట్టుకోలేదని, వారిని అరెస్టు చేయాలని కొందరు నెటిజన్లు డిమాండ్ చేశారు.

ఉద్యోగి ఇంట్లో చోరీ..
ఫ్రిడ్జిలో పెట్టిన కీలో టామాటలు మాయం.

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18: ప్రస్తుతం మార్కెట్‌లో టమాటాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో వీటి చోరీల ఘటనలు కూడా పెరిగిపోతున్నాయి. తాజాగా నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఇంతకు మించిన సంఘటన చోటుచేసుకుంది.. బోధన్ మున్సిపాల్ ఉద్యోగి రఫి ఇంట్లో చోరి జరిగింది. గౌడ్స్ కాలనీలో నివాసముండే రఫి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి సిద్దిపేట వెళ్లారు.. తిరిగి వచ్చేసరికి ఇళ్లంతా చిందర వందరగా పడి ఉండటంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీలో 12 తులాల బంగారం తో పాటు, లక్ష రూపాయల నగదును అపహరించారు. దీనిపై పోలిసులకు ఫిర్యాదు చేశారు.ఇంటికి వచ్చి దోంగతనం జరిగిందని గుర్తించిన కుటుంబ సభ్యులకు ఇంకో విషయం తెలిసి అవాక్కయ్యారు. ఊరేళ్లే ముందు ఫ్రిడ్జిలో పెట్టిన కీలో టామాటలు కూడా మాయం అవడంతో షాక్ తిన్నారు. దొంగలు బంగారం, నగదుతో పాటు టామాటలు కూడా వదిలి పెట్టకపోవడం అక్కడున్న వాళ్లను ఆశ్చర్యానికి గురి చేసింది. దీంతో పోలిసులకు చేసిన

పిర్యాదులో బంగారం, నగదుతో పాటు టామాటలను కూడా పేర్కొన్నాడు ఇంటి ఓనర్ రఫీ.

వారిది 'హార్డ్ కోర్ కరప్షన్ కాన్ఫరెన్స్' టీమ్..
ప్రతిపక్ష సమావేశాలపై ప్రధాని మోదీ సెటైర్లు..

ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూలై 18: ప్రతిపక్ష పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. బెంగళూరులో జరుగుతున్న విపక్ష పార్టీల సమావేశాన్ని 'హార్డ్ కోర్ కరప్షన్ కాన్ఫరెన్స్' టీమ్ అంటూ ఆయన అభివర్ణించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకత్వంలో దేశ ప్రజలు మరోసారి ఓటు వేస్తారని పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని తీసుకురావాలని ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. పోర్ట్ బ్లెయిర్‌లోని వీర్ సావర్కర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లోని కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన తరువాత ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఈ వ్యాఖ్యలు చేశారు. విపక్ష పార్టీలకు దేశంలోని పేదల పిల్లల అభివృద్ధి అనేది వారికి ముఖ్యం కాదని, వారి పిల్లలు, సోదరులు, మేనల్లుళ్ల అభివృద్ధి మాత్రమే వారికి ముఖ్యం అని విమర్శించారు.లక్షల కోట్ల రూపాయల అవినీతి చేసినవారు ఆ సమావేశాల్లో కూర్చుని కనిపిస్తారని అన్నారు. మీకు కెమెరాలో కనిపిస్తున్నవారంతా వారే అని అన్నారు. ఇది హార్డ్ కోర్ అవినీతి సమావేశం. లేబుల్ వేరొకటి, ఉత్పత్తి మరొకటి అంటూ ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. వారి ఉత్పత్తి రూ.20 లక్షల కోట్ల కుంభకోణం అని అని అన్నారు.

'దేశంలోని పేదల పిల్లల అభివృద్ధి కాదు, తన సొంత పిల్లలు, సోదరులు, మేనల్లుళ్ల అభివృద్ధి ముఖ్యం' అని ప్రధాని అన్నారు. వారికి ఒకే ఒక భావజాలం.. మీ కుటుంబాన్ని రక్షించండి, కుటుంబం కోసం అవినీతిని పెంచండి. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత మన భారతదేశం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుకుందో తెలుసన్నారు. భారతీయులమైన మన సామర్థ్యానికి ఎప్పుడూ లోటు లేదు. కానీ అవినీతి, కుటుంబ ఆధారిత పార్టీలు సామాన్య భారతీయుడి ఈ సామర్థ్యానికి ఎప్పుడూ అన్యాయం చేస్తూనే ఉన్నారని అన్నారు.

భార్య నిద్రలోకి జారుకునేదాకా ఎదురుచూసిన భర్త..
ఆ తర్వాత చప్పుడు కాకుండా వెళ్లి..

ఇయ్యాల్టి న్యూస్, నిజాంపేట, జూలై 18: అగ్నిసాక్షిగా ఏడడుగులు నడిచాడు, మూడు ముళ్లు వేసి కడ వరకు తోడుగా ఉంటానని మాటిచ్చాడు. అయితే ఆ వాగ్దానల్నింటినీ పక్కన పెట్టాడు. చివరికి కాల యముడిగా మారి కట్టుకున్న భార్యనే కడతేర్చాడు. కంటికి రెప్పలా చూసు కోవాల్సిన, భార్యను తనకు ఇష్టం లేదంటూ కడతేర్చి పరారైనాడు భర్త.. సిద్దిపేట మిరుదొడ్డి మండల కేంద్రంలో ఈ దారుణం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన భవానికి.. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన కనకరాజుకు వివాహం జరిగి ఏడాది గడిచింది. అయితే వివాహం జరిగినప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచు గొడవలు జరుగుతూనే ఉన్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు కూడా అయ్యాయి. ఈ నేపథ్యంలోనే రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న భవాని ముఖంపై దిండు పెట్టి చంపేసి అక్కడి నుండి పరారయ్యాడు కనక రాజు.ఉదయాన్నే భవాని ఎంతకు నిద్ర లేవకపోవ డంతో చుట్టుపక్కల వారు గమనించి భవాని ఇంట్లో తొంగిచూడగా శవమై కనిపించడంతో ఆందోళన చెంది పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు పోలిసులు. నిందింతుడు కనక రాజును కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు, మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు.

యూఎస్ హెచ్-1బి వీసాదారులకు గుడ్ న్యూస్...

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18:

యూఎస్ హెచ్-1 బి వీసాదారులకు అమెరికా శుభవార్త వెల్లడించింది. హెచ్-1 బి వీసాదారులు ఇక నుంచి కెనడాలో పనిచేయవచ్చని యూఎస్ తెలిపింది. యూఎస్ హెచ్-1 బి వీసాదారులు 10వేల మంది కెనడా ఓపెన్ వర్క్ పర్మిట్ స్ట్రీమ్‌ను ప్రారంభించింది. అమెరికాలో ఉన్న 75 శాతం భారత హెచ్-1 బి వీసాదారులకు ప్రయోజనం చేకూరనుంది.

కెనడా ప్రభుత్వం 10వేల మంది దరఖాస్తులను స్వీకరించనుంది. యూఎస్ వీసాదారుల్లో ఉన్న సాంకేతిక ప్రతిభను ఆకర్షించడానికి కెనడా ఈ కొత్త పథకాన్ని ప్రారంభించింది. అత్యంత నైపుణ్యం ఉన్న కార్మికులను ఆకర్షించడానికి కెనడా యూఎస్ నుంచి హెచ్ 1 బి వీసా హోల్డర్లకు ఓపెన్ వర్క్ పర్మిట్లను ఇవ్వడం ప్రారంభించింది. యూఎస్ వీసా ఉన్న వారు మూడు సంవత్సరాల పాటు కెనడాలో పనిచేసేందుకు అనుమతించనుంది. 2023 వసంవత్సరం జులై 16వతేదీ నాటికి హెచ్1 బి వీసా హోల్డర్‌లు, వారితో పాటు ఉన్ కుటుంబ సభ్యులు కెనడాకు రావడానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కెనడియన్ ప్రభుత్వం ఈ నెల ప్రారంభంలో విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. యూఎస్ వీసాదారులు కెనడాలో ఎక్కడైనా పనిచేసుకునేందుకు వీలుగా తాత్కాలిక నివాస వీసా ఇస్తారు.

చెల్లిని తుపాకీతో కాల్చి చంపిన మూడేళ్ల చిన్నారి..!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18: అమెరికా లో తుపాకీ సంస్కృతికి మరో చిన్నారి బలైంది. గన్ అంటే ఏంటో తెలియని ఓ మూడేళ్ల చిన్నారి దాంతో ఆటలాడుతూ పొరపాటున ట్రిగ్గర్ నొక్కింది. ప్రమాదవశాత్తూ జరిగిన ఈ ఘటనలో ఏడాదిన్నర చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో చోటు చేసుకుంది . వివరాల్లోకి వెళితే.. శాన్ డియాగో కౌంటీ ఫాల్ బ్రూక్ లో మూడేళ్ల చిన్నారి తన ఏడాదిన్నర చెల్లితో కలిసి ఆడుకుంటోంది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న గన్ తీసుకుని ట్రిగ్గర్ నొక్కింది. దీంతో ఎదురుగా కూర్చున్న పాప తలలోకి బుల్లెట్

దూసుకుపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు రక్తపు మడుగుల్లో పడి ఉన్న చిన్నారిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆ చిన్నారి అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కొడుకు కాలేజీ ఫీజు కోసం తల్లి....
యాక్సిడెంట్‌లో మరణిస్తే డబ్బులు వస్తాయని..?

ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూలై 18: తల్లి ప్రేమను మించింది సృష్టిలో మరొకటి ఉండదు అంటే అతిశయోక్తి కాదు. పిల్లల భవిష్యత్తును తీర్చి దిద్దే క్రమంలో ఎన్నో త్యాగాలు చేస్తుంది. చివరికి తన ప్రాణాలను సైతం ఫణంగా పెడుతుంది. తన కొడుకు చదువుకు ఫీజ్ కోసం తన ప్రాణాలు సైతం త్యాగం చేసిన అమ్మ.. ఇలాంటి ఇతి వృత్తంతో అర్జున్ హీరోగా జెంటిల్మెన్ గతంలో తెరకెక్కింది. అప్పట్లో ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. తాజాగా అప్పటి సినిమాలోని ఘటన నేడు తమిళనాడులో రియల్ గా జరిగింది. కొడుకు కాలేజీ ఫీజు కట్టడం కోసం ఏకంగా తన ప్రాణాలనే త్యాగం చేసింది.సేలం జిల్లాకు చెందిన పాపాతి అనే 45 ఏళ్ల మహిళ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. భర్తనుంచి విడిపోయి తన కొడుకుతో కలిసి జీవిస్తోంది. కష్టపడి కొడుకును చదివిస్తోంది.

తన కొడుకు పెద్ద చదువులు చదవాలని, అతనికి మంచి భవిష్యత్తును ఇవ్వాలని కలలు కంది. కానీ తనకు వచ్చే జీతంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు భారంగా మారాయి. అయినా వెనకడుగు వేయలేదు. కాలేజీ ఫీజు కట్టేందుకు డబ్బుల్లేక, ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం కోసం బలవన్మరణానికి పాల్పడింది. తాను చనిపోతే ప్రభుత్వం 45 వేల రూపాయలు నష్టపరిహారం ఇస్తుంది.. దాంతో తన కొడుకు చదువు కొనసాగుతుందని భావించిన పాపాతి వేగంగా దూసుకొస్తున్న బస్సుకు ఎదురెళ్లింది.. బస్సు ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది.

బెంగళూర్ భేటీలో కీలక నిర్ణయాలు

రెండో రోజు సమావేశానికి హాజరైన స్టాలిన్

ఇయ్యాల్టి న్యూస్, బెంగుళూరు, వెబ్ డెస్క్, జూలై 18: కర్నాటక రాజధాని బెంగళూర్‌లో విపక్షాల భేటీలో రెండో రోజు మంగళవారం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని దీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాలను ఈ భేటీలో ఖరారు చేశారు సమిష్టిగా తీసుకోవాల్సిన అంశాలపై బ్లూప్రింట్ తయారుచేసేందుకు కమిటీ ని ఏర్పాటు చేశారు.కనీస ఉమ్మడి కార్యక్రమం స్థానంలో లేవనెత్తాల్సిన ఉమ్మడి అంశాలను గుర్తించి జాబితా రూపొందించేందుకు కమిటీని నియమించే అవకాశాన్ని పరిశీలించారు. ఇక యూపీఏ పేరు మార్పు విషయంలోనూ విపక్షాల సమావేశంలో నేతలు కసరత్తు సాగిస్తున్నారు. నాలుగైదు పేర్లను పరిశీలిస్తున్న నేతలు నూతన కూటమి పేరును ప్రకటించే అవకాశం ఉంది. కూటమి పేరులో ఫ్రంట్ అనే పదం వాడరాదని టీఎంసీ సూచించింది.

ఇక బెంగళూర్‌లో విపక్ష సమావేశం రెండో రోజు తమిళనాడు సీఎం

ఎంకే స్టాలిన్, డీఎంకె ఎంపీ టీఆర్ బాలు హాజరయ్యారు. సమావేశానికి ముందు కేరళ మాజీ సీఎం ఊమెన్ చాండీ మృతికి నేతలు సంతాపం ప్రకటించారు. దివంగత నేత మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించామని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు.

దేవుడే ఫోన్ చేసి... డబ్బులు పంపించమన్నాడట..
ఒకట్రెండు కాదు.. ఏకంగా.!

ఇయ్యాల్టి న్యూస్, వెబ్‌డెస్క్, జూలై 18: సాధారణంగా మన దగ్గర అనుకున్నదానికంటే.. డబ్బులు ఎక్కువగా ఉంటే.. వాటిని బ్యాంకులో డిపాజిట్ చేసుకుంటాం. సేవింగ్స్ అకౌంట్‌పై బ్యాంక్ వడ్డీ ఇస్తుందో కాబట్టి.. చాలామంది ఇదే పని చేస్తారు. సరిగ్గా ఇదే కోవలో ఓ మహిళ కూడా తన దగ్గరున్న డబ్బును బ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. ఇంతకీ ఆ బ్యాంక్ ఎక్కడుందో తెలుసా.? స్వర్గంలోనండీ..! ఏంటీ ఆశ్చర్యపోతున్నారా.. మీరు వింటున్నది నిజమే.. ఇంతకీ ఆ స్టోరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందామా..వివరాల్లోకి వెళ్తే.. స్పెయిన్‌లోని లియోన్ ప్రాంతానికి చెందిన ఎస్పెరాన్జా అనే వృద్ధురాలు నివసిస్తోంది. ఆమెకు ఓ రోజు ఒక ఫోన్ కాల్ వచ్చింది. స్వర్గంలోని 'చర్చి ఆఫ్ హెవెన్' అనే బ్యాంక్‌లో నువ్వు డబ్బులు డిపాజిట్ చేస్తే.. నీకు రెండింతల లాభం వస్తుందని ఆ ఫోన్ కాల్ సారాంశం. ఇక ఈ ఫోన్ కాల్‌ను ఆ వృద్ధురాలు సీరియస్‌గా తీసుకుంది. దేవుడే ఆమెకు ఫోన్ చేసి.. డబ్బులు

పంపించమన్నాడని గట్టిగా నమ్మింది. అనుకున్నదే తడువుగా ఇంట్లో వాళ్ళెవ్వరికీ తెలియకుండా సుమారు 6 ఏళ్ల పాటు తన దగ్గరున్న డబ్బును ఆ బ్యాంక్‌లో డిపాజిట్ చేసింది. తన సొమ్మంతా స్వర్గానికి చేరుకుంటోందని భావించింది.అంతటితో ఆగలేదు.. తన దగ్గర డబ్బులు లేకపోయినా.. లోన్ తీసుకుని మరీ పంపించింది. ఇలా సుమారు రూ. 2.76 కోట్లు ఆ 'చర్చి ఆఫ్ హెవెన్' బ్యాంక్‌లో జమ చేస్తూ వచ్చింది. కట్ చేస్తే.. ఆమె అకౌంట్ మొత్తం ఖాళీ అయిపోవడంతో.. పిల్లలకు తల్లిపై అనుమానమొచ్చింది. ఏం జరిగిందోనని తల్లిని విచారించగా.. అసలు విషయం బయటపడింది. కాగా, తల్లి ఇంటికి దగ్గరలో నివాసముంటున్న ఓ వ్యక్తి.. ఈ తతంగం మొత్తాన్ని నడిపించాడని తెలుసుకుంటారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారి కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని జైలులో ఊసలు లెక్కపెట్టించారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

అన్ని ప్రశ్నలకు ఒకే ఒక్క పోస్ట్‌తో సమాధానం : పవర్‌స్టార్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: పవన్ కళ్యాణ్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఓపెన్ చేసిన రోజు నుంచే మొదటి పోస్ట్ ఏం పెడతారని అంతా ఆసక్తిగా చూస్తున్నారు. మొత్తానికి ఆయన పోస్ట్ చేసారు.. చాలా రోజులుగా అభిమానులతో పాటు కామన్ ఆడియన్స్‌లో ఉన్న అనుమానాలకు ఈ ఒక్క పోస్టుతోనే చెక్ పెట్టారు పవన్. ఇండస్ట్రీతో తన రిలేషన్‌ను చెప్తూనే.. ఫ్యూచర్‌లో సినిమాలు చేస్తారా చేయరా అనే దానికి సమాధానమిచ్చారు. పవన్ కళ్యాణ్ అంటే అభిమానులకు హీరో అనే స్టేజ్ దాటి.. ఎమోషన్ వరకు వెళ్లిపోయారు. పొలిటికల్‌గా ఆయన జర్నీ ఎలా ఉన్నా సినిమాల వరకు మాత్రం తిరుగులేని సూపర్ స్టార్. పొలిటికల్ బిజీలో పడి సినిమాలు చేస్తాడా చేయరా అనే అనుమానం అభిమానుల్లో చాలా రోజులుగా పవన్ ఫ్యాన్స్ మదిలో అలాగే ఉండిపోయింది. వీటన్నింటికీ ఒక్క పోస్ట్‌తో సమాధానమిచ్చారు జనసేనాని. చూస్తున్నారుగా.. పవన్ కళ్యాణ్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత చేసిన మొదటి పోస్ట్ ఇదే. ఏదో పొలిటికల్ పెడతారు అనుకుంటే.. పక్కా సినిమా పోస్ట్ పెట్టి అందరికీ షాకిచ్చారు పవర్ స్టార్. అంతేకాదు.. ఎప్పుడూ మీతో బంధం ఇలాగే ఉండాలని.. ఉంటుందని చెప్పుకొచ్చారు. దీన్నిబట్టి రాజకీయంగా ఎంత బిజీగా ఉన్నా.. సినిమాలను వదిలేది లేదని తేల్చేసారు పవన్.

అలాంటి సినిమాల్లో నటించాలని ఉంది..
మనసులో మాట చెప్పిన కేతిక

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: రొమాంటిక్ సినిమా తర్వాత ఈ అమ్మడు క్రేజీ ఆఫర్స్ అందుకుంటుంటుంది. రొమాంటిక్ తర్వాత చేసిన లక్ష్య సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. ఆతర్వాత రంగరంగవైభవంగా అనే సినిమా చేసింది. ఈ సినిమాలో పంజా వైష్ణవ్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేక పోయింది. ఇక ఇప్పుడు పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటిస్తున్న బ్రో సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాలో తేజ్ కు జోడీగా కనిపించనుంది. అన్న తమ్ముడు ఇద్దరితో కలిసి నటించింది కేతిక. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బయోపిక్స్ లో నటించాలని ఉందని తెలిపింది కేతిక. అలాగే స్విమింగ్ అంటే తనకు చాలా ఇష్టమని.. స్విమింగ్ నేపథ్యంలో తెరకెక్కే సినిమాలో నటించాలన్నది తన కోరిక అని తెలిపింది కేతిక.

చూసి మురవాలె.....

చబ్బీ చబ్బీగా ఘాటు అందాలు.. హొరెత్తిస్తున్న శ్రీముఖి పిక్స్..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18:
బుల్లితెరపై నుండి వెండితెర వరకు క్రేజీ గర్ల్‌గా దూసుకుపోతున్న యాంకర్ శ్రీముఖి గురించి ప్రత్యేకంగా చెప్పాలా.. తన చలాకీతనంతో, అందంలు ఆరబోస్తూ నెక్స్ట్ లెవల్ ఫాలోయింగ్ ను సంపాదించుకుంది.. విరబూసిన అందంతో సోషల్ మీడియాలో వెలుగులు పంచుతుంది ఈ వయ్యారి.. ఈ హాట్ ఫొటోస్ మీరు చూసెయ్యండి.

లాంగ్ టైమ్ డ్రీమ్ పూర్తి చేసే పనిలో సమంత.. అదేంటంటే

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: ఖుషీ షూటింగ్ అయిపోయింది.. సిటాడెల్‌లో తన పోర్షన్ పూర్తైపోయింది.. పైగా ముందుగానే ఏడాది బ్రేక్ కూడా అనౌన్స్ చేసారు.. దాంతో ఇంకేముంది సమంత ఫారెన్ వెళ్లిపోయుంటారు.. ఇలా షూటింగ్ అయిపోగానే అలా ఫ్లైట్ ఎక్కేసుంటారని అనుకుంటున్నారంతా. కానీ అక్కడికి వెళ్లే ముందే తన లాంగ్ టైమ్ డ్రీమ్ ఒకటి పూర్తి

చేసుకుంటున్నారు ఈ బ్యూటీ. ప్రస్తుతం అదే పని మీదున్నారు స్యామ్. ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నారు సమంత. మయోసైటిస్ వచ్చినప్పటి నుంచి ఏ మాత్రం రిస్క్ తీసుకోడానికి ఇష్టపడటం లేదు. అందుకే తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సినిమాలు చేయాలనుకోవడం లేదు. ఇప్పటికే విజయ్ దేవరకొండతో నటిస్తున్న ఖుషీ షూటింగ్ పూర్తైపోయింది. దాంతో పాటు సిటాడెల్ సిరీస్‌లోనూ ఈ మధ్యే తన కారెక్టర్ పూర్తి చేసారు స్యామ్. ప్రస్తుతానికి కొత్త సినిమాలకు దూరంగానే ఉన్నారీమె. షూటింగ్ నుంచి ఫ్రీ అయిపోయారు కదా.. నేడో రేపో బ్రీథ్టెంట్ కోసం ఫారెన్ వెళ్తారని ఫ్యాన్స్ అనుకుంటుండగా.. అనుకోని ట్విస్ట్ ఇచ్చారు సమంత. ప్రస్తుతం తన లాంగ్ టైమ్ డ్రీమ్ నెరవేర్చుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఓ రోడ్ ట్రిప్ వేయాలని ప్లాన్ చేస్తున్నారు సమంత.

హొయలు పోతున్న పడుచు బంగారం..
అందం, అభినయంతో 'అషికా రంగనాథ్'..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: అమిగోస్ మూవీతో తెలుగులో అడుగు పెట్టిన అషికా రంగనాథ్ తన అందం, అభినయంతో ఫిల్మ్ ఇండస్ట్రీ లో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచింది. చేతినిండా ఆఫర్స్ తో ఈ ముద్దుగుమ్మ కాస్త బిజీ గానే ఉంటుంది.. ఇదే టైంలో సోషల్ మీడియాలో ఈ వయ్యారి భామ ఫుల్ క్రేజ్ తో స్పీడ్ మీద ఉంది. తాగాజా ఈ అమ్మడు పోస్ట్ చేసిన ఫొటోస్ చూసి కుర్రకారు పిచ్చెక్కిపోతున్నారు..

బేబీ హీరోయిన్ వైష్ణవి చైతన్య.. ఫస్ట్ రెమ్యునరేషన్ ఎంతంటే .?

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: వైష్ణవి చైతన్య.. ఇప్పుడు ఈ అమ్మడు పేరు టాలీవుడ్ లో కాస్త ఎక్కువగానే వినిపిస్తుంది. వైష్ణవి హీరోయిన్ గా నటించిన తొలి సినిమా బేబీ. ఈ సినిమా రీసెంట్ గా రిలీజ్ అయ్యి మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా యువతని ఈ సినిమా విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన ఈ సినిమా హిట్ అవ్వడంతో వైష్ణవి పేరు మరుమ్రోగుతోంది. వైష్ణవి చైతన్య సోషల్ మీడియాను ఫాలో అయ్యే వారికీ బాగానే తెలుసు. ఇన్స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ వీడియోలతో మంచి పాపులారిటీ తెచ్చుకుంది. ఇక ఈ అమ్మడు నటించిన వెబ్ సిరీస్ లు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ బ్యూటీ నటించిన సాఫ్ట్ వేర్ డవలపర్స్ మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఇప్పుడు బేబి సినిమాతో సూపర్ హిట్ అందుకోవడంతో ఈ అమ్మడికి అవకాశాలు క్యూ కడుతున్నాయి. ప్రమోషన్స్ లో వైష్ణవి ఎమోషనల్ స్పీచ్ ఆడియన్స్ కు బాగానే కనెక్ట్ అయ్యింది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో తన పై వచ్చిన నెగిటివ్ కామెంట్స్ గురించి తెలిపింది. అలాగే బేబీ సినిమాతో నటిగా వైష్ణవి నిరూపించుకుంది. తన నటనతో ఆకట్టుకుంది ఈ భామ. ఇక ఈ అమ్మడు తన కెరీర్ లో అందుకున్న ఫస్ట్ రెమ్యునరేషన్ ఎంతో తెలుసా.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైష్ణవి మాట్లాడుతూ తన మొదటి రెమ్యునరేషన్ గురించి తెలిపింది. తన మొదటి సంపాదన 700 అని చెప్పింది. ఓ ఈవెంట్ కోసం డ్యాన్స్ చేస్తే 700 ఇచ్చారట. రోజంతా కష్టపడి డాన్స్ చేస్తే 700 ఇచ్చారని తెలిపారు. ఆ రెమ్యునరేషన్ తనకు చాలా ప్రత్యేకం అని తెలిపింది.



నేనింకా ప్రెగ్నెంట్ కాలేదు.. కాబట్టి ఇప్పట్లో పెళ్లి లేనట్టే: నటి తాప్సీ

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: మనసులో ఉన్నది ఏదైనా దేరింగ్‌గా బయటకు చెప్పే నటీమణుల్లో తాప్సీ కూడా ఒకరు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా ఆమె చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. కొంతకాలంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్న తాప్సీ సోమవారం తన అభిమానులతో ముచ్చటించారు. ట్విట్టర్ వేదికగా 'ఆస్క్ మీ ఎనీథింగ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ అభిమాని యథప్రకారం తాప్సీ పెళ్లి గురించి మొదలెట్టాడు. "నువ్వు పెళ్లెప్పుడు చేసుకుంటావు?" అంటూ సూటి ప్రశ్న వేశాడు. ఆ అభిమాని ప్రశ్నకు తాప్సీ తనదైనీ ఫన్నీ స్టైల్‌లో సమాధానం ఇచ్చింది. "సో.. నా పెళ్లి ఎప్పుడు అని అంటారా? ప్రస్తుతమైతే నేను ప్రెగ్నెంట్ కాదు. కాబట్టి.. ఇప్పుడప్పుడే పెళ్లి లేనట్టే" అంటూ టక్కున సమాధానమిచ్చిన తాప్సీ ఆపై పడీపడి నవ్వింది. నెటిజన్లు కూడా తాప్సీ హాస్య చతురతకు కడుపుబ్బా నవ్వుకుంటున్నారు. తాప్సీ కొన్నేళ్లుగా బాడ్మింటన్ కోచ్ మథాయస్ బోయితో రిలేషన్‌షిప్‌లో ఉంది. ఖాళీగా ఉన్నప్పుడల్లా ఆమె తన బాయ్‌ఫ్రెండ్, ఆయన సోదరితో కలిసి హాలీడేకు వెళ్లిపోతుంటుంది. సుదీర్ఘ హాలీడే ట్రిప్‌ను ఇటీవలే ముగించుకుని వచ్చిన తాప్సీ ఈ మధ్య తాను హాలీడేల్లోనే ఎక్కువగా గడిపేస్తున్నానని వ్యాఖ్యానించింది. తదుపరి ట్రిప్‌లో క్రాబీ ద్వీపానికి వెళ్లే ఆలోచనలో ఉన్నట్టు కూడా చెప్పుకొచ్చింది.

అందానికే అందం.. అనుపమ క్యూట్ ఫోటోస్...

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: అనుపమ పరమేశ్వరన్ పరిచయమే అవసరం లేని పేరు.. తెలుగు ఇండస్ట్రీ క్రష్ హీరోయిన్స్ లిస్ట్‌లో ఈ మలయాళీ ముద్దుగుమ్మ ముందు వరసలో ఉంటుంది. హిట్స్ తో సంబంధం లేకుండా ఫాలోయింగ్ లో నెక్స్ట్ లెవల్ ఉంటుంది.. ఈ సొగసరి ఎక్స్ప్రెషన్స్‌కి ఫాలోయింగ్ విపరీతంగా ఉంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫొటోస్ మరింత ఆకట్టుకుంటున్నాయి.

సీమంత, నీహారిక బాటలో మరో స్టార్ కపుల్..? మళ్లీ అదే ప్రచారం..

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూలై 18: తెలుగు ప్రేక్షకులకు కలర్స్ స్వాతి పరిచయం అక్కరలేని పేరు. బుల్లితెర నుంచి వెండి తెరకు అక్కడ నుంచి పలు దక్షిణాది సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, అష్టా చమ్మా, స్వామిరారా, కార్తికేయ వంటి సూపర్ హిట్ సినిమాలతో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. 2018లో తన బాయ్‌ఫ్రెండ్ వికాస్ వాసును వివాహం చేసుకుని సినిమాలకు దూరంగా ఉంటోంది ఈ బ్యూటీ. ఐతే తాజాగా స్వాతి గురించిన ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. స్టార్ సెలబ్రెటీలు ఎవరైనా తమ వైవాహిక బంధానికి ముగింపు పలకాలని భావిస్తే అందుకు సంకేతంగా తొలుత సోషల్ మీడియాలో తమ పార్ట్‌నర్‌కు సంబంధించిన ఫొటోలు తొలగించడం, ఇంటి పేరును మార్చుకోవడం వంటివి సమంత-నాగ చైతన్య, నీహారిక-చైతన్య జొన్నలగడ్డ విషయంలో జరిగాయి. ఆ తర్వాత కొన్ని రోజులకు విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించారు కూడా. ఐతే ఆ మధ్య స్వాతి కూడా సోషల్ మీడియాలో తన భర్త ఫోటోలను తొలగించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా గత కొంతకాలంగా తన భర్త వికాస్‌కు దూరంగా ఉంటోందని, తాను కూడా విడాకులు తీసుకోబోతుందని పలు యూట్యూబ్ చానళ్లతో పాటు సోషల్ మీడియాలోనూ వార్తలు వైరల్ అవుతున్నాయి. కాగా స్వాతి వివాహ బంధం గురించి ఇలాంటి ప్రచారం జరగడం ఇదేమీ తొలిసారి కాదు. రెండేళ్ల క్రితం కూడా స్వాతి విడాకులు తీసుకోబోతుందని ప్రచారం జరిగింది. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో భర్త ఫోటోలు తొలగించడంపై అప్పట్లోనే క్లారిటీ ఇస్తూ వీడియో పోస్ట్ చేసింది. భర్తతో కలిసి దిగిన

ఫోటోలను ఆర్కివ్స్‌లో దాచుకున్నానని చెబుతూ.. ఆ ఫొటోలతో ఓ చిన్న వీడియో తీసి ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది కూడా. దీంతో విడాకుల పుకార్లకు బ్రేక్ వేసినట్లైంది. ఇప్పుడు మరోసారి ఈ వ్యవహారం తెరపైకి రావడంతో వైరల్‌గా మారింది.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838